క్లుప్తంగా

వైష్ణవి కళాశాలలో ఫిలాటలి ఎగ్జిబిషన్



తెనాలిఅర్బన్: రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫిలాటలి ఎగ్జిబిషన్‌ను తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 15 వరకు నేషనల్ ఫిలాటలి ఎగ్జిబిషన్‌ను ఢిల్లీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా తెనాలిలో దీనిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో అనేక పురస్కారాలు పొందిన వి.సాయికృష్ణ సేకరించిన పలు స్టాంపులను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వాసవి, పవన్ కుమార్, శివయ్య పాల్గొన్నారు.

5న కంటి వైద్యశిబిరం

తెనాలి: పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఫిబ్రవరి 5వ తేదీన ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్ ప్రాంగణంలో ఆరోజు ఉదయం 8 గంటల్నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారు. అవసరమైనవారికి శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా శుక్లాల ఆపరేషను చేస్తారు. పట్టణానికి చెందిన కుమార్ పంప్స్, సోదర సంస్థ సుబ్రమ్ సంస్థల సహకారంతో వైద్యశిబిరం జరుపనున్నట్టు నిర్వాహకులు వివరించారు.

వంట గ్యాస్ పట్ల అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న మురళీకృష్ణ

తెనాలిఅర్బన్: వంటగ్యాస్ ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని శ్రీ సత్యనారాయణ ఇండియన్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు మురళీకృష్ణ సూచించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వంట గ్యాస్ వల్ల జరిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన తెలియజేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, కోగంటి వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

తెనాలిరూరల్: అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన తెనాలిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ గురవయ్య కాలనీకి చెందిన యర్రంశెట్టి పున్నమ్మ భర్త 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. ముగ్గురు కుమారులు, కుమార్తె ఉండగా వారికి వివాహాలై వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఒంటరిగా నివసిస్తున్న పున్నమ్మ మంగళవారం తన గదిలో మృతి చెంది ఉంది. ఉదయం బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వాళ్లు లోనికి వెళ్లి చూడగా మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలల పట్ల బాధ్యతగా ఉండాలి

తెనాలిరూరల్: బాలల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ వారి హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్యానల్ న్యాయవాది ఎన్వి మహేశ్వరరావు పేర్కొన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కఠెవరం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది మాట్లాడుతూ వీధి బాలల పట్ల అఘాయిత్యాలు జరగకుండా ఉండేందుకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వీధి బాలలు అనాధలైనప్పటికీ వారికీ హక్కులు ఉంటాయని, వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని చెప్పారు. సదస్సులో పిఎల్వి యర్రంశెట్టి అనీల్ కుమార్, గ్రామ కార్యదర్శి బాషా, సచివాలయ మహిళా పోలీసులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్న,చిన్న మరమ్మతులు కూడా చేయరా !

- ఎన్నిసార్లు చెప్పాలంటూ అధికారులపై మండిపడిన కౌన్సిలర్లు
- వెంటనే వాటిని చేయాలని చైర్‌పర్సన్ ఆదేశం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్ కోటేశ్వరరావు

తెనాలిఅర్బన్: రక్షిత మంచి నీటి పథకం పైప్‌లైన్ ఏర్పాటు కోసం సిమెంట్ రోడ్లు పగులకొట్టి వదిలేశారు. నెలలు దాటుతున్న కనీసం వాటిని పూడ్చడం లేదు. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న, చిన్న మరమ్మతులు కూడా చేయకపోతే అలా అని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, మరి కొందరు కౌన్సిలర్లు అధికారులపై మండిపడ్డారు. వెంటనే వాటిని చేయాలని చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ ఆదేశించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కాగానే సినీ నటి జమున మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అజెండా చదివి 19 అంశాలు ఆమోదించారు. 20వ అంశం చదవటం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు లేచి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేయడంలేదని, ఇలా అయితే ఎలా అని ప్రశ్నించారు. 14వ ఆర్థిక సంఘ నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉండడం.. నిధులు వెంటనే విడుదల అవుతుండటం వల్ల వాటికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, 15వ ఆర్థిక సంఘ నిధుల విడుదల్లో కొంత జాప్యం జరగడం వల్ల వాటి పనులు మందకొడిగా సాగుతున్నాయని కమిషనర్ ఎం జశ్వంతరావు, ఎంఈ నాగమల్లేశ్వరరావు తెలిపారు. వాటిని కూడా త్వరగా పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించకుండా నిధులు ఏలా ఉపయోగిస్తారు..?

11,15 వార్డులకు ఒకే సచివాలయం ఉంది. 11వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కానీ 15వ వార్డులో ఇప్పటి వరకు దానిని నిర్వహించకుండా సచివాలయానికి వచ్చిన రూ.20 లక్షల నిధులు ఒక వార్డుకే ఏలా ఉపయోగిస్తారని వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు ప్రశ్నించారు. తన వార్డులో ప్రజలు చెప్పేమౌలిక వసతుల సమస్యలను ఏలా పరిష్కరిస్తారని, ఇదేమి పద్దతని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనిధులను రెండు భాగాలు చేసే బాధ్యత అధికారులకు లేదా అని ప్రశ్నించారు. దీంతో అధికారులు నీళ్ళునమిలారు.



సినీ నటి జమున మృతికి మౌనం పాటిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, ఎంఈ, కౌన్సిలర్లు

ఇంతలో కమిషనర్ జోక్యం చేసుకుని 15వ వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఎస్టిమేషన్ వేయాలని ఏఈలను ఆదేశించారు. వాటికోసం మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చిస్తామని హామీ ఇచ్చారు. 31వ అంశం చదవడం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి లేచి అజెండాలో పొందుపరచిన 42 టెండర్లలో 36 పనులకు సింగిల్ టెండర్లు వచ్చాయని, దీనికి కారణం తెలియజేయాలన్నారు. అలాగే వాటిని రద్దు చేయాలని కోరారు. నిధుల విడుదల్లో జాప్యం వల్ల పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రావడం లేదని ఎంఈ తెలిపారు. ఇంతలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు టెండర్లు ఆమోదిస్తున్నట్లు తెలిపారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు డిసెంట్ ఇచ్చారు. అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో అప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో నెలకొన్న సమస్యలను అప్‌లోడ్ చేయండి

ఎంఈఓ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎస్‌టిఎంఎస్ లాగిన్‌లో సీపీఎం గ్రీవెన్స్ ద్వారా ఫోటోలను అప్‌లోడ్ చేయాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. కొత్తపేటలోని ఎంఈఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాడు-నేడు ఫేజ్-1 పనులపై సమీక్ష జరిపారు. ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే వాటిని పూర్తి చేయించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని, ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. మండల స్థాయిలోని బృందాలన్ని అన్ని పాఠశాలలను తనిఖీ చేసి రిపోర్టును అందజేయాలన్నారు. ఉన్నతాధికారులు పాఠశాలలను తనిఖీ చేసే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంఆర్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం చేస్తున్న నిందితుల అరెస్ట్

- 80 గ్రాముల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ స్రవంతిరాయ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్, పక్కన సీఐ వెంకట్రావు

తెనాలి రూరల్: ఆభరణాల కొనుగోలు పేరిట దుకాణ యజమానులను బురిడీ కొట్టిస్తున్న వ్యక్తితో పాటు వాటిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు సహకరిస్తున్నా మరోవ్యక్తిని అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ చెల్లింపు పేరిట రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ కె. స్రవంతిరాయ్ వివరాలను వెల్లడించారు. బాపట్ల జిల్లాలో ముప్పవరం మండలానికి చెందిన ఉదరగుడి అశోక్ బంగారు షాపులను టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఇందులో భాగంగానే తెనాలి టూ టౌన్ పీఎస్ పరిధిలోని ఓ బంగారు షాపులో 48 గ్రాముల రెండు బంగారు గొలుసులు కొనుగోలు చేశాడు. షాపు యజమానికి నగదు ఇవ్వకుండా ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ చేస్తానంటూ నమ్మబలికాడు. అలా తన ఫోన్‌లోని యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులు పంపినట్లు సెండ్ కంప్లీట్ అంటూ స్క్రీన్ షాట్ ఎడిటింగ్ చేసి షాపు యజమానికి చూపించాడు. అనంతరం అక్కడి నుంచి ఆభరణాలతో వెళ్లిపోయాడు. తర్వాత తమకు నగదు జమ కాకపోవడాన్ని షాపు యజమాని గుర్తించి పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా నిందితుడు ఉదరగుడి అశోక్‌ను గుర్తించి విచారిస్తే ఇలా అనేక చోట్ల మోసాలు చేసినట్లు గుర్తించారు. తెనాలితో పాటు మంగళగిరి, విజయవాడ, గుంటూరు, ఒంగోలు ప్రాంతాల్లో పలు షాపుల్లో మొత్తం 334 గ్రాముల బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి యజమానులను ఈ విధంగానే మోసగించినట్లు నిర్ధారించారు. మోసం చేసి కాజేసిన ఆభరణాలను విజయవాడకు చెందిన హిందూస్తాన్ గోల్డ్ కంపెనీ మేనేజర్ కొలచిన శ్రీనివాస్‌తో కుమ్మక్కై అతడికి కమిషన్లు ఇస్తూ నగలు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. దీంతో ప్రధాన నిందితుడితో పాటు గోల్డ్ కంపెనీ మేనేజర్ శ్రీనివాస్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి ప్రస్తుతానికి 80 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోగా మిగిలినది రికవరీ చేయాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు. బెంగుళూరు కేంద్రంగా ఉన్న హిందూస్తాన్ గోల్డ్ కంపెనీ అసలైందా లేదా నకిలీదా అన్నది కూడా విచారించే పనిలో పోలీసులు ఉన్నారు. సమావేశంలో డీఎస్పీ స్రవంతి రాయ్‌తో పాటు సీఐ ఎస్ వెంకట్రావు, ఎస్ఐ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

తెనాలిటౌన్: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వి సుబ్బారావు తెలిపారు. రూరల్ మండలం కొలకలూరు శివారు ఖాజీపేటలోని సచివాలయంలో మంగళవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ సదస్సుల ద్వారా కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించవచ్చని, మచ్చలు ఉన్నట్లయితే ఆ మచ్చలు కుష్ఠు వ్యాధికి సంబంధించినవా, కాదా అని డాక్టర్ నిర్ధారణ చేస్తారని తెలిపారు. కుష్ఠు వ్యాధి మచ్చలు అయితే మందులు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, హెచ్ఈఓ నాగరాజు, సూపర్‌వైజర్లు జి.శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, ఎఎన్ఎం లక్ష్మీ శిరీష, హెచ్ఏలు సుష్మ, శరత్, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గృహ వినియోగదారులకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏ ఈ పి.ప్రదీప్ కుమార్ తెలిపారు. కావున ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్ కారణంగా కారు దగ్ధం

తెనాలి రూరల్: షార్ట్ సర్క్యూట్ కారణంగా కారు దగ్ధమయిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. తెనాలి మండలం తెలప్రోలు గ్రామం నుంచి ఆటోనగర్ వైపు మంగళవారం వెళ్తున్న ఇండిగో కారు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్న నలుగురు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే దిగిపోయారు. దీంతో ప్రాణహాని తప్పింది. ఘటనపై ఎటువంటి పోలీస్ కేసు నమోదు కాలేదు.

వాలీబాల్ జాతీయ జట్టుకు వీరరాఘవమ్మ ఎంపిక



సూరేపల్లి(భట్టిప్రోలు): జాతీయ స్థాయి వాలీబాల్ జట్టుకు స్థానిక వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని యరగళ్ల వీరరాఘవమ్మ ఎంపికైంది. ఇటీవల రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో కర్నూలులోని మాంటిస్సోరీ ఎ - క్యాంపస్‌లో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. జాతీయ జట్టులో తమ విద్యార్థిని ఎంపికకావడమే కాక జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావులను హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస శర్మ పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు రమణారావు అభినందించారు.

నేడు ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవం

రేపల్లె రూరల్: కారుమూరు గ్రామంలో నిర్వహిస్తున్న చెన్నకేశవస్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. మహోత్సవాలు మంగళవారానికి రెండో రోజు కు చేరాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త లు రామకృష్ణ, డాక్టర్ ఆదిత్యల ఆధ్వర్యంలో అ ర్చకులు వెంకటాచార్యులతో ప్రత్యేక పూజా కా ర్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ స భ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చే శా రు. అదేవిధంగా స్వామివారి విగ్రహాలకు సా యంత్రం గ్రామోత్సవం కార్యక్రమం చేశారు.

దయామణి సేవలు మరువరానివి



డాక్టర్ విద్యాసాగర్‌కు అప్రీషియేషన్ అవార్డును అందిస్తున్న ప్రవీణ్‌వర్మ, సురేష్

తెనాలిఅర్బన్: అత్తోట దయామణి ఉపాధ్యాయురాలుగా అనేక మంది విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడ్డారని వైఎస్సార్ సీపీ నాయకులు మేకల రవి, ప్రవాసాంధ్రుడు ఆరమళ్ళ ఆనంద్‌బాబులు కొనియాడారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు దయామణి వర్ధంతిని మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని దయామణి జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సోమవారం రాత్రి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారుడు, ప్రవాసాంధ్రుడు డాక్టర్ అత్తోట విద్యాసాగర్‌కు ఇంటర్నేషనల్ అంబాసిడర్స్ పీస్ కార్పొరేషన్ వారు అప్రీషియేషన్ అవార్డును అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో బిషప్ గొరికపూడి ప్రవీణ్ వర్మ, పినపాటి సురేష్‌బాబు, అత్తోట రత్నశేఖర్, స్కూల్ కరస్పాండెంట్ అత్తోట హేమలత, అత్తోట లావణ్య, పాస్టర్ విజయ్‌కుమార్, మేకల సురేష్, సొపాటి కిరణ్, పినపాటి డేవిడ్ రాజు, పినపాటి వినయ్, పినపాటి కొండలరాజు, ఏటుకూరి రాజకిషోర్, బొంతా ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి



మాట్లాడుతున్న టు టౌన్ ఎస్ఐ శివరామయ్య

తెనాలిఅర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని టు టౌన్ ఎస్ఐ బి.శివరామయ్య అభిలాషించారు. వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో మంగళవారం యూత్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో జీవిస్తూ మాదక ద్రవ్యాలకు, అసాంఘిక, సంఘ విద్రోహ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ బాగా చదువుకున్న వారికి మనదేశంలో ఉద్యోగాలకు కొదువ లేదన్నారు. లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ వి.రమేష్, విశ్రాంత అధ్యాపకులు ఎం.సాంబశివరావు, డైరెక్టర్ డాక్టర్ ఎస్.నవీన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు సుబ్బారావుకు సన్మానం



సుబ్బారావును సన్మానిస్తున్న శివరావు, శివరాంప్రసాద్

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం యుగపురుషుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం పవిత్ర హృదయాలు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు నక్కా సుబ్బారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంటా శివరావు, పరుచూరి శివరాంప్రసాద్, కొత్త రమేష్ బాబు, పరుచూరి నాగమునీంద్రరావు, కొత్త సూర్యనారాయణ, తాడిశెట్టి శివాని, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, తరణి హేమంత్ కుమార్, తాడిశెట్టి మునిస్వామి, దుంపల రోశయ్య, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర, శరీరదానం చేసిన కొత్తపల్లి సుధాబాల



తెనాలి: భౌతికంగా మరణించినా ఉదాత్తమైన ఆశయంతో కొందరు చిరంజీవులుగా ఉంటారు. ఇంకొకరి శరీరాల్లో జీవించే ఉంటారు...నవీన ఆవిష్కరణలకు దోహదపడే ప్రయోగాలకూ ఉపయోగపడతారు. పట్టణంలోని ఈటీ కాలనీకి చెందిన కొత్తపల్లి సుధాబాల (77)ఇందుకో నిదర్శనం. ఆమె భర్త కొత్తపల్లి రవిబాబు. జనసాహితి మాసపత్రికకు నాలుగు దశాబ్దాలుగా ప్రధాన సంపాదకుడుగా ఉన్నారు. రేపల్లె దగ్గర్లోని నగరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేసి రిటైరయ్యారు. రవిబాబు సాహిత్య ఉద్యమానికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చిన సుధాబాల, మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వగృహంలో మృతిచెందారు. కుటుంబసభ్యులు ఆమె అంతిమ యాత్ర వంటి చివరి సంస్కారాలను తలపెట్టలేదు. గుంటూరులోని అగర్వాల్ కంటి ఆసుపత్రికి ఆమె నేత్రాలను దానం చేశారు. దన్వంతరి ఐ డొనేషన్ కేంద్రం సహకారంతో ఉదయాన్నే ఆమె కార్నియాను సేకరించుకువెళ్లారు. శరీరాన్ని వైద్యవిద్యార్థుల పరీక్షల కోసం అప్పగించగా, ఆ ప్రకారం విజయవాడ దగ్గర్లోని నిమ్రా వైద్య కళాశాల టెక్నీషియన్లు సాయంత్రం సుధాబాల భౌతికకాయాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాస్తిక సమాజం అధ్యక్షుడు, అమ్మ అవయవ, శరీరదాన సంఘం, తెనాలి కో-ఆర్డినేటర్ నండూరి నారాయణరావు సహకరించారు. జనసాహితి ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు దివికుమార్, ప్రజాసాహితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరుణ, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు, బుద్ధభూమి ఎడిటర్ గోలి సీతారామయ్య, రచయితలు బొర్రా గోవర్ధన్, ముత్తేవి రవీంద్రనాథ్, దాసరి శివకుమారి, వెంకటేశ్వర్లు బొమ్మదేవర వెంకటేశ్వర్లు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, అయినాల మల్లేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, చందు నాగేశ్వరరావు, గద్దే శ్రీనివాసరావు, బసవరావు, షేక్ అబ్దుల్ హకీంజాని, గంటినపాటి ప్రేమ్‌చంద్ నివాళులర్పించినవారిలో ఉన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న నారాయణ స్కూల్ విద్యార్థులు

తెనాలిఅర్బన్: నారాయణ స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో కొల్లావారి వీధిలోని మహాత్మ గాంధీ శాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిహెచ్.వి ఎస్.ప్రసాద్, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, కుమార్, డి.కృష్ణమోహన్, ఎ.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు సమాయత్తం కావాలి



పేటేరు గ్రామంలో చిరుధాన్యాల ఉత్పత్తులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రేపల్లె రూరల్: చిరుధాన్యాలు సాగు చేసేందుకు రైతులు సమాయత్తం కావాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు అన్నారు. చిరుధాన్యాల సంవత్సరం-2023 కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పేటేరులో చిరుధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, సాములు, అరికలు, వరిగల మానవుని ఆరోగ్యానికి, వ్యాధినిరోధక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. వీటిలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఇనుపధాతువులు, కాల్షియం వంటినే అనేక పోషకపదార్థాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి రవికిరణ్, పంచాయతీ సెక్రటరీ పుష్పకుమారి, గ్రామ వ్యవసాయ సహాయకులు కొండలు, సుష్మా, నాగలక్ష్మి, ఏఈవో పావని, ఎంపీఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

బలిజేపల్లి(వేమూరు): చిరుధాన్యాలు సాగు లాభసాటిగా ఉంటుందని శాస్త్రవేత్త గంగాదేవ్ తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో మంగళవారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంపై సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మలత, డీఆర్‌సీ ఏఓ వి.ఉమామహేశ్వరి, వేమూరు ఏఓ సునీత, వీఏఏ లూధియా కుమారి పాల్గొన్నారు.